క్లుప్తంగా

కేసీ ఉప కాలువలకు నీటి విడుదల

శిరివెళ్ల: కేసీ కెనాల్ ఉప కాల్వలకు గురువారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నీటిని విడుదల చేశారు. కేసీ కెనాల్ 16వ లాక్ వద్ద పూజలు చేసి శిరివెళ్ల, కోటపాడు, యర్రగుంట్ల, గోవిందపల్లె ఉప కాల్వలకు సాగు నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి, మెట్ట పంటలు, ఆరుతడి పంటల సాగుకు నీరు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ రవీంద్ర, ఏఈలు నాగేశ్వరరెడ్డి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీ బాధ్యతల స్వీకరణ

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా నాగలక్ష్మమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు పాణ్యం మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కోవెలకుంట్ల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగలక్ష్మమ్మ పదోన్నతిపై ఉయ్యాలవాడ ఈఓపీఆర్డీగా వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌ల సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



సీఐకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

శిరివెళ్ల: మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులకు గురువారం ప్రభుత్వ డాక్టర్ ముఖేష్ కుమార్ వివిధ వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్, ఉపాధి పథకం, పోలీస్టేషన్‌లోని అధికారులు, సిబ్బందికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఇదివరకే నంద్యాల మెడికల్ కళాశాల డాక్టర్లు ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు చేశారన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందజేసిన ఉపాధ్యాయులు

నంద్యాల(అర్బన్): స్థానిక పొన్నాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి సహకారంతో క్రీడా దుస్తుల పంపిణీ చేపట్టారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఐజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యలోనే కాకుండా క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించి పాఠశాలకు పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి, విజయరావు, దస్తగిరి, సుభాన్, పీఈటీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు



రుద్రవరంలోని చిల్లర దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

రుద్రవరం: నిషేధిత వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహ్మద్ రఫీ తెలిపా రు. గురువారం పాఠశాలల వద్ద ఉన్న చిల్లర దుకాణాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలకు 100 మీటర్ల దూరంలో గుట్కా, పాన్ పరాగ్, సౌభాగ్య పేడ రంగు వంటి విక్రయాలపై నిషేధం ఉన్నట్లు తెలిపారు. దుకాణదారులు నిషేధిత వస్తువులను విక్రయించరాదని సూచించారు. నిబంధన ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్‌ఐ భూపాల్ రెడ్డి, కానిస్టేబుల్స్ ఉన్నారు.

ఐదుగురు మందుబాబులపై కేసు

కోవెలకుంట్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. పట్టణ శివారులోని వివిధ ప్రాంతాల్లో గురువారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అలాగే స్థానిక ముదిగేడు చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లె, అవుకు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో అవకతవకలు

- ముత్యాలపాడులో సామాజిక తనిఖీలో వెల్లడి



ముత్యాలపాడు సచివాలయం వద్ద సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహిస్తున్న సిబ్బంది

చాగలమర్రి: మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామపంచాయతీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో పలు అవకతవకలు చోటుచేసుకున్నట్లు సామాజిక తనిఖీ బృందం తేల్చింది. గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. గ్రామంలో మొత్తం 1325 మందికు జాబ్ కార్డులు మంజూరు కాగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో 277 పనులకు రూ.1.92 కోట్లు ఖర్చు చేసినట్టు ఎస్‌ఆర్‌పీ భాస్కర్, డీఆర్‌పీ భగవాన్‌లు పేర్కొన్నారు. అయితే, మాత్రం 922 మందికి మాత్రమే పని కల్పించగా, కేవలం 130 మందికే 100 రోజుల పని కల్పించినట్లు తెలిపారు. గ్రామంలో చేపట్టిన 277 పనులకు రూ.1.06 కోట్లు వేతనాలకు, రూ.42.27 లక్షలు మెటీరియల్‌కు మంజూరయ్యాయని, ఇందులో పంచాయతీ రాజ్ పనులకే రూ.28 లక్షలు వెచ్చించినట్టు తెలిపారు. అయితే అందులో ఏడు పనులే గుర్తించగలిగామని, మిగిలిన రెండు పనులకు సంబంధించిన ఆధారాలు లేవని పేర్కొన్నారు. హార్టికల్చర్ పథకంలో పంపిణీ చేసిన మొక్కలు మూడు సంవత్సరాలుగా బిల్లులు వేసినప్పటికీ పొలాల్లో మొక్కలు కనిపించలేదని తెలిపారు. అదేవిధంగా చక్రవర్తులపల్లెకు చెందిన మూడు ఐడి నంబర్లకుగాను అసలు పని చేయకుండానే రూ.11 లక్షలు ఖర్చు చేసినట్టు తనిఖీలో తేలిందన్నారు. గ్రామ సభను కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించగా, తనిఖీ నివేదికను డీఆర్‌పి భగవాన్ చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏపీఓలు నిర్మల, ఖాశీం, టీసీ బాలునాయక్, డీఆర్‌పీ యువరాజ్, ఈసీ వెంకటన్న, ఫీల్డ్ అసిస్టెంట్ జయరాంనాయక్, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేతనాలు అడిగితే తొలగిస్తారా?



నిరసన వ్యక్తం చేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్లు

గోస్పాడు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎంఓయూ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, వేతనాలు అడిగిన సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్లను అక్రమంగా తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంఓయూ ప్రకారం వేతనాలు రూ.18,600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 9 సంవత్సరాల నుంచి ఈగల్ హంటర్ అనే సంస్థ.. సెక్యూరిటీ గార్డ్స్‌ను దోచుకు తింటోందని ఆరోపించారు. ఎంఓయూ ప్రకారం వేతనం ఇవ్వమని ప్రభుత్వం సర్క్యులర్ మేరకు వేతనాలు పెంచమని అడిగితే అందుకు నాయకత్వం వహించిన వారిని బెదిరించడం దుర్మార్గమన్నారు. ఏజెన్సీ రూ.8వేలు ఇస్తే తీసుకోవాలా అని నిలదీశారు. ప్రభుత్వాసుపత్రిలో 45మంది పని చేయాల్సి ఉన్నా 37 మందితో చేయిస్తున్నారని మండిపడ్డారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకులు నాగన్న, చెన్నయ్య, బాలయ్య, ఆది, రమణ, నరేష్, శీను, హైమావతి, లత, జయరాజు పాల్గొన్నారు.

రెజాంగ్ లా కలశ యాత్రను విజయవంతం చేయండి

ఆత్మకూరు: రెజాంగ్ లా కలశ యాత్రను విజయవంతం చేయాలని అఖిలభారత యాదవ సంక్షేమ సంఘం నాయకులు శివరామ్‌యాదవ్, రవిశంకర్‌యాదవ్, రమణయ్యయాదవ్, రఘురాముడుయాదవ్ కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ భారత సైన్యంలో అహిర్(యాదవ) రెజిమెంట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఈ యేడాది ఏప్రిల్ 13న బిహార్ రాష్ట్రంలో ప్రారంభమైన కలశ యాత్ర వివిధ రాష్ట్రాల మీదుగా నవంబర్ 18న ఢిల్లీకి చేరుకుంటుందన్నారు. అందులో భాగంగా ఈనెల 19న ఆత్మకూరు మీదుగా వెళ్తుందన్నారు. ఉదయం 10 గంటలకు నంద్యాల టర్నింగ్ నుంచి యాత్ర ప్రారంభమై గొల్లపేట, గాంధీపార్కు, తోటగేరి, పాత బస్టాండు మీదుగా గౌడ్‌సెంటర్‌కు చేరుకుంటుందన్నారు. యాదవ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. 1962లో రెజాంగ్ లా ప్రాంతం వద్ద జరిగిన భారత్–చైనా యుద్ధంలో భారతదేశం తరఫున 114 మంది యాదవ సైనికులు 5 వేల మంది చైనా సైనికులతో తలపడి 1,310 మందిని హతమార్చారన్నారు. యాదవ సైనికుల ధైర్యసాహసాలకు గుర్తుగా అప్పట్లో ఏర్పాటు చేసిన అహిర్(యాదవ)రెజిమెంట్‌ను తదనంతర కాలంలో కేంద్రం రద్దు చేసిందన్నారు. రద్దు చేసిన అహిర్ రెజిమెంట్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రెజిమెంట్ పునరుద్ధరిస్తే యాదవ యువత సైన్యంలో చేరి దేశ భద్రతకు పాటుపడతారన్నారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు బొల్లు ప్రసాద్‌యాదవ్, రమేష్ యాదవ్, నాగేశ్వరయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, సామన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాలు అందించాలి

మహానంది: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి శివప్రసాద్ ఆదేశించారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేసి, హెచ్‌ఎం సత్యాలు, ఉపాధ్యాయులతో వివిధ అంశాలపై చర్చించారు. ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: ఈనెల 19న మహానందిలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లతో పాటు ఆంజనేయస్వామి, కోదండరామాలయం, వినాయకనంది ఆలయాలు, గోసంరక్షణ, అన్నప్రసాద విభాగాల వద్ద ఉన్న హుండీల కానుకలను లెక్కిస్తామన్నారు.

నేడు కొలనుభారతి దేవి ఆలయంలో శాకంబరి పూజ

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసి సరస్వతీ క్షేత్రంగా విరాజిల్లుతున్న కొలనుబారతి దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శాకంబరి పూజను నిర్వహించనున్నట్లు పురోహితులు శ్రీనివాసశర్మ తెలిపారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

మహానంది: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ఓటర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మార్పులు, చేర్పుల సమయంలో తప్పులకు తావివ్వొదన్నారు.

రైలు నుంచి పడి యువకుడి దుర్మరణం



బేతంచెర్ల: విశాఖపట్నం వైపు వెళ్లే రైలులో నుంచి యువకుడు జారిపడి మృతిచెందిన ఘటన బేతంచెర్ల–ఆర్‌ఎస్ రంగాపురం రైల్వే స్టేషన్ మధ్య గురువారం చోటుచేసుకుంది. యువకుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని.. తెల్ల షర్టు, బ్లాక్ ప్యాంట్, మెడలో పూరిజగన్నాథ్ లాకెట్ ఉందని, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ మధుసుధాకర్ తెలిపారు. ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెందాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పే ర్కొన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు 9849492653 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పథకాల అమలుపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న బాబాఫక్రుద్దీన్

గోస్పాడు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల అమలులో నిర్లక్ష్యం తగదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యుడు ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రం గోస్పాడులో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తూ ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా హామీలను నెరవేర్చకపోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. గ్రామాల్లో ఇళ్లులేని పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోస్పాడు శాఖ కార్యదర్శిగా షేక్‌మౌలా, సహాయ కార్యదర్శిగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై ఈనెల 30, 31 తేదీల్లో డోన్‌లో జరపనున్న జిల్లా మహాసభలను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. నాయకులు హరినాథ్, జిలానీ బాషా, ప్రజా నాట్యమండలి నాయకులు గోకారి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్


నంద్యాల(న్యూటౌన్): స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించినట్లు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుడు పుల్లానరసింహులు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో పట్టణ పౌరుల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ ఏసురత్నం, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, క్రిస్టియన్ జేఏసీ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ మస్నెంజానయ్య, ముస్లిం జేఏసీ కన్వీనర్ అబులైజ్ మాట్లాడుతూ వినియోగదారులపైన మోపిన ఇంధన సర్దుబాటు విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రూ.15,526 కోట్లు ప్రజలపై వేసిన అదనపు భారాలు రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని కోరుతూ ఈనెల 22వ తేదీన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23 నుంచి 29వ తేదీ వరకు ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, 30 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు కాలనీల్లో సమావేశాలు, ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం ముట్టడి, తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. సీపీఐ నాయకుడు శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకుడు ప్రసాద్, పీటర్, నాగరాజు, రామరాజు, రాంబాబు, లక్ష్మణ్, నరసింహనాయక్ పాల్గొన్నారు.

అరటి తోటల్లోకి తెలుగుగంగ నీళ్లు




మహానంది: మండలంలోని తెలుగుగంగ కాలువకు వదిలిన నీళ్లు బుక్కాపురం, తమ్మడపల్లె మీదుగా నందిపల్లె వరకు వెళ్లే క్రమంలో అరటి తోటల్లోకి వెళ్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని 11వ బ్లాక్ వెంట కాలువలు బలహీనంగా ఉండటంతో నీటి ఉధృతికి కొట్టుకుపోతున్నాయని, తద్వారా పంట పొలాల్లోకి నీళ్ల వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువలను పటిష్టం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కలుషిత నీరే శరణ్యం!



ఒండ్రు మట్టి నీటిని తలపిస్తున్న తాగునీరు



పగిద్యాల: మండలంలోని పడమర ప్రాతకోట ముస్లిం కాలనీవాసులకు కలుషిత నీరే శరణ్యమైందని వాపోతున్నారు. కాలనీవాసుల దాహార్తిని తీర్చేందుకు కూటమి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే నిధులతో స్థానిక నేలగండి వద్ద కేసీ కాలువ గట్టుపై బోరు వేసి కాలనీకి పైప్‌లైన్ కనెక్షన్ ద్వారా నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. అయితే ఈ నీరు కలుషితమై వస్తుండడంతో కాలనీవాసులు ఆందోళనలకు గురవుతున్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కూడా కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా సభ దృష్టికి తెచ్చి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్‌ను ప్రశ్నించారు. అయినా ఆ నీరు తాగినా ఏమి కాదని, అన్ని టెస్టులు చేయించామని పేర్కొనడం గమనార్హం. బోర్ శ్మశాన వాటిక దగ్గరలో ఉండటంతోనే భూగర్భ జలాలు కలుషితమై సరఫరా అవుతున్నాయని కాలనీవాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రైతులను విస్మరించిన సీఎం

నందికొట్కూరు: మండలం చుట్టూ శ్రీశైలం బ్యాక్ వాటర్ ఉన్నా సాగు, తాగు నీరు అందిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వలేకపోయారని సీపీఐ(ఎంఎల్ న్యూ డెమోక్రసీ) జిల్లా కార్యదర్శి నరసింహులు ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మల్యాల ఫేజ్–1 నుంచి రెండు మోటార్లను ఆన్ చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి.. నందికొట్కూరు మండల రైతులకు, ప్రజలకు సాగు, తాగు నీరు అందిస్తానని చెప్పకపోవడం తగదన్నారు. రాయలసీమలో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరందిస్తానని గొప్పలు చెప్పడం పక్కనపెట్టి, ముందు నందికొట్కూరు నియోజకవర్గంలో సాగు, తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు.

డ్రోన్ ద్వారా ప్రత్యేక నిఘా





నిఘా కోసం తెచ్చిన డ్రోన్, రుద్రవరం శివారులో డ్రోన్ ద్వారా తీసిన విజువల్స్

రుద్రవరం: మండలంలో డ్రోన్ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మహ్మద్ రఫీ తెలిపారు. గురువారం డ్రోన్ ద్వారా రుద్రవరం శివారు ప్రాంతంలో విజువల్స్ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు ప్రదేశాల్లో విజువల్స్ తీశామని తెలిపారు. పబ్లిక్ ప్రదేశాలు, ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా మద్యం సేవించే వారిపై, అసాంఘిక శక్తులపై డ్రోన్ సాయంతో నిఘా ఉంచనున్నట్లు చెప్పారు. బహిరంగంగా మద్యం సేవించే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో నిఘా ఉంచనున్నట్లు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



పురుగుల మందు నిల్వను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

దొర్నిపాడు: మండల కేంద్రంలోని ఎస్‌ఎం ఆగ్రో, విజయలక్ష్మి ఎరువుల దుకాణాలను స్టేట్ ఎక్స్‌ట్రనల్ స్కార్డ్ టీం ఏడీఏ నరసింహారెడ్డి, విజిలెన్స్ ఎస్‌ఐ గోపాలుడు గురువారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. ధరల పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి ప్రమీల తదితరులు ఉన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?



ఒరిగిన విద్యుత్ స్తంభం

నంద్యాల(అర్బన్): విద్యుత్ స్తంభం ఒరిగిపోతుండటంతో పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ, లక్ష్మీనగర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. వర్షా కాలం కావడంతో విద్యుత్ స్తంభం మరింతగా ఒరిగి ఇళ్ల మీద పడిపోయే అవకాశముందని, విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపితే లేబర్ ఖర్చులు భరిస్తే ఒరిగిన స్తంభాన్ని సరిచేస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానికులు బషీర్ అహమ్మద్, వీరభద్రప్ప, కృష్ణారెడ్డి తదితరులు వాపోయారు.

రోడ్డుపైకి వచ్చిన ప్రమాదం!



మాయలూరు, ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో రహదారిపైకి వచ్చిన ముళ్లపొదలు

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు–ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారితో పాటు భీమునిపాడు–ఆర్.జంబులదిన్నె రహదారిపై ముళ్ల పొదలు ఇరువైపులా విస్తరించి ప్రయాణికులు, వాహనదారులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ రహదారులపై నిత్యం ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే, బస్సుల్లో ప్రయాణించే సమయంలో కిటికీ దగ్గర కూర్చున్న ప్రయాణికులకు ముళ్ల పొదలు తగిలి గాయాలయ్యే ప్రమాదం ఉంది. పైగా ఎదురెదురుగా వాహనాలు వస్తున్నపుడు రోడ్డు పక్కకు వెళ్లేందుకు కూడా డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చొరవ చూపి ముళ్ల పొదలను తొలగించి రహదారిని సురక్షితంగా మారుస్తే ప్రయాణికులకు ఉపశమనం లభిస్తుందని స్థానికులు కోరుతున్నారు.

దత్తాత్రేయుడికి విశేష పూజలు



శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద నెలకొని ఉన్న దత్తాత్రేయ స్వామికి గురువారం విశేష పూజలను నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు.

నర్సాపురం పాఠశాల పక్కనే పెంట దిబ్బలు



నర్సాపురం ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న పెంట దిబ్బ

రుద్రవరం: మండలంలోని నర్సాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద పెంట దిబ్బలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ప్రహరీకి ఆనుకుని పశువుల పేడను రైతులు కుప్పలుగా వేసిన కారణంగా దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయాయని, పిల్లలు అనారోగ్యానికి లోనవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాల ఆళ్లగడ్డ–అహోబిలం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సమీపంలో ఉంది. ప్రహరీ నిర్మాణం చేసినప్పటికీ, రోడ్డుకి మధ్య ఖాళీ స్థలంలో పెంటను కుప్పలుగా వేసేవారు. దాంతో పాఠశాల అంతర్భాగంలోకి దుర్గంధం వ్యాపించడంతో పాటు దోమల ఉధృతి పెరిగి, చిన్నపిల్లలు తరచూ జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్నట్టు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ అంశంపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందనలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెంట దిబ్బలను తొలగించి పరిసరాలను శుభ్రం చేసి విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలని కోరుతున్నారు.